# "గత కాలము మేలు"....

## - పాణంగిపల్లి నాగభూషణం

మా తాత చాలా సార్లు, మా నాన్న ఎన్నోసార్లు, గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్... అన్న అర్థం వచ్చేటట్లు మాట్లాడ్డం, ప్రవర్తించడం నాకు వచ్చేది కాదు.

అది వారి వయసు తెచ్చిన పలాయన వాదం అనీ, సంఘంలో 'వచ్చిన మార్పునీ పురోగతినీ చూసి తట్టుకోలేని ఓ విధమైన చాందస భావం అనీ, వాళ్ళు పాతకాలం మనుషులనీ నాకు అనిపించేది

నేను నా బాల్యం అంతా మా తాత దగ్గరే గడిపాను. అంటే టెన్త్ పరీక్ష పాసయ్యే దాకా మా తాత వద్దే వుండి చదువుకున్నాను. మా నాన్నకి హైదరాబాద్‌లో ఉద్యోగం. మా తాత వుండేది ఒక పల్లెటూర్లో. ఆ వూర్లో వీధిలో సరకు ఇంట్లోకి వచ్చే మార్గం లేదని , మా తాత బామ్మలకి సాయంగా ఉంటాడని, నన్ను అక్కడ వుంచి చదివించారు మా అమ్మా, నాన్న.

టెన్త్ తరువాత ఆ వూర్లో జూనియర్ కాలేజీ లేదు. అందువల్ల నేను మా నాన్న దగ్గరకి హైద్రాబాద్ చదువుకోసం వెళ్ళి పోయాను. మా తాత, బామ్మ కూడా ఆ వయసులో మనిషి సాయం లేకుండా ఒక్కరే ఆ వూర్లో వుండలేక మా అమ్మా, నాన్నల దగ్గరకి హైద్రాబాద్ వచ్చేశారు.

పల్లెటూళ్ళల్లో నా చిన్నతనంలో ఇండ్లల్లో లెట్రిన్లు (ఇప్పటిదున్నంత) వుండేవి కావు. బహిర్భూమి కోసం ఎండైనా, వానైనా, రాత్రైనా అవస్థ పడుతూ చెంబు చేత పుచ్చుకుని గోదావరి గట్టుకు పోవల్సిందే.

వానాకాలం అయితే అంతా రొచ్చు - బురద. తలచుకుంటేనే ఒళ్ళు జుగుప్సతో జలదరిస్తుంది. ఒక అడుగు ముందుకు వేస్తే రెండడుగులు వెనక్కి జారేది కాలు. ఒక చేత్తో ఈదురుగాలికి ఎగిరి పోయే గొడుగు, రెండో చేత్తో చెంబు. ఆ అవస్థ నిజంగా వర్ణనాతీతం. రాత్రి అయితే నేను లాంతరు పుచ్చుకుని ముందు నడుస్తుంటే, వెనకాల మా తాత కర్ర ఊతం చేసుకుని చెంబు పట్టుకుని నడిచేవాడు.

హైద్రాబాద్‌లో మా నాన్న ఇంట్లో ఎటాచ్‌డ్ టాయిలెట్స్, ఎవరి సాయం అక్కరలేదు. ఓ ఎండ బాధగానీ, వాన బాధకానీ లేదు. చీకటి బాధ అసలే లేదు. చాలా సౌకర్యంగా వుండాలి మా తాతకి. అయినా పాత కాలము మేలు అనేవాడు.

మా బామ్మ అంతే. పొయ్యిలో పుల్లలు సరిగా మండక, పొగతో కళ్ళు ఎర్రబడిపోయి నానా అవస్థలు పడినా కూడా "ఇత్తడి గిన్నెలో అది మసి బారకుండా బూడిదరాసి సన్నటి కర్రల మంట మీద నెమ్మదిగా ఉడికిన అన్నం రాచ్చిప్పలోని పులుసు, వాటిల్లోనే బలం, రుచి కానీ గేస్ స్టౌల మీద కుక్కర్లలో ఆదర బాదరా వండిన అన్నానికి ఉడకేసిన కూర ముక్కలకి ఓ రుచా పచా" అనేది.

మా నాన్న అంతే. తను చదువుకునే రోజుల్లో మా వూర్లో హైస్కూలు లేదు. రోజూ నడిచి మూడు కిలోమీటర్లు దూరంలో వున్న పక్క వూరు వెళ్ళి వచ్చే వాడు చదువుకోసం. మా తమ్ముడు, చెల్లాయి అయితే హాయిగా దర్జాగా ఆటోలో వెళ్ళి వచ్చేవారు స్కూలుకి హైదాబాద్‌లో. అయినా గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్ అన్నట్లు మాట్లాడేవాడు.

మా నాన్న చిన్నతనంలో నడక, ఆ తర్వాత కొంచెం ఎదిగాక సైకిలే ప్రయాణ సాధనాలు. ఇప్పుడు స్కూటరు, కారు చేతిలో వుండి ప్రయాణం ఎంతో సుఖమయం అయినా కూడా గత కాలం మేలు వచ్చు కాలము కంటే... అంటే ఎట్లా?

మా అమ్మ అంతే. మా తమ్ముడు పుట్టిన సమయంలో, ఆ రోజుల్లో పల్లెటూర్లో సరియైన ఆస్పత్రి సౌకర్యం లేక ఆమె ప్రాణం మీదకి వచ్చిందట. ఆయుర్దాయం వుండి బతికిందట. ఈనాటికీ ఎంతో గర్వంగా మా అమ్మ ఈ మాట చెప్తుంది. అదే మా అమ్మ మా చెల్లెలికి పురుడు ఆధునిక సౌకర్యాలున్న పెద్ద ఆస్పత్రిలో, అనాయాసంగా, హాయిగా జరిగేలా చూసుకుంది. అయినా గత కాలమే మేలు అంటుంది.

ఇదిలా వుండగా ఓ సారి మా దగ్గరి బంధువుల అమ్మాయి వివాహానికి, నేను పుట్టి పదో తరగతి వరకు చదువుకున్న ఆ పల్లెటూరు వెళ్ళాము. ఆ వూరు వదిలి అప్పటికి సరిగ్గా పాతిక సంవత్సరాలైంది.


ఆ గోదావరి గట్టు. రేవులో వున్న పెద్ద రావిచెట్టు. గట్టుకి బాగా క్రిందుగా ప్రశాంతంగా, ఆహ్లాదంగా ప్రవహించే గోదావరి. అక్కడక్కడ సుదూరంగా ఇసుక మేటలు గోదావరికి అవలి గట్టున, చిత్రకారుడు తన బొమ్మకి ఆకుపచ్చని పెన్సిల్‌తో గీసిన బోర్డరులా కొబ్బరి చెట్లు.

ఎన్నెన్నో వేసవిలో సాయంత్రాలు గంటలు తరబడి గోదావరిలో మిత్రులతో కలసి చేసిన స్నానాల గుర్తుకు వచ్చాయి. వాటి ముందు హైద్రాబాద్‌లో షవర్ కింద చేసిన స్నానం వెల వెల బోయింది.

డబ్బులు పారేస్తే కష్టపడకుండా బోలెడు జాంకాయలు. అయినా చిన్న తనంలో గోడెక్కి పక్కింట్లో వున్న జామచెట్టు ఎక్కి దొంగతనంగా కోసుకుని, మిత్రులతో కాకి ఎంగిలి చేసుకుని తిన్న జాంకాయలే బాగారుచిగా వున్నట్లు అన్పించింది.

ఎండ మండి పోతున్నా, గెడకర్ర పట్టుకుని మెడలు నొప్పి పుట్టేలా కష్టపడి కోసుకున్న చీమచింతకాయల్లోని మాధుర్యం కొనుక్కుని తిన్న చీమ చింతకాయల్లో కన్పించదు.

డబ్బులు పెట్టి హైద్రాబాద్‌లో కొనుక్కుని తిన్న బాదం పప్పు చప్పగా వుందనిపించింది. జబ్బలు పడిపోయేలా, రాళ్ళు విసిరి చెట్టు నుంచి బాదం కాయలు రాల్చుకుని, వాటిని బద్దలు కొట్టుకుని మిత్రులతో కలసి చిన్నప్పుడు తిన్న బాదం పప్పే మిన్న అన్పించింది.





ఇలా నా బాల్య స్మృతులు ఒక్కసారిగా చుట్టు ముట్టి నన్ను ఏవో లోకాలకి లాక్కుపోయాయి. పరిసరాలు మర్చిపోయాను. అప్పుడు నాకు అనుభవమైంది. మా నాన్న, తాత ఎందుకు గత కాలము మేలు అంటారో.

ఆ భావన తిరోగమనం కాదు. అభివృద్ధి వ్యతిరేకం అసలే కాదు. అది వారు పెరిగిన పరిసరాలతో, కాలంతో, జీవన పరిస్థితులతో వారికి వున్న దృఢమైన అనుబంధం, చెరిగిపోని మధురమైన మైత్రి, తరగని మమకారం. మానాన్న, తాతల పాతకాలం మనుషులు అన్న అభిప్రాయం పూర్తిగా తొలగి పోయింది. గత కాలము మేలు అన్నది ఎంత వాస్తవమో నాకు తెలిసింది. గతకాలం అంటే తప్పని సరిగా అందులో బాల్యం వుంటుంది. ఆ బాల్యం అంతా ఎంతో తీయగా వుంటుంది. అవును కదూ! అందుకే గత కాలము మేలు అనిపిస్తుంది. ఏమంటారు?